ప్రగతి పథంలో..!



రాగోలులో వేసిన మంచినీటి పైపులైన్లు

- సచివాలయ నిధులతో చకచకా అభివృద్ధి పనులు
- గడప గడపకు మన ప్రభుత్వంతో సమస్యలకు మోక్షం

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. మూడున్నరేళ్లలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరించేందుకు ప్రజల వద్దకు వెళ్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు.. స్థానికులు పలు సమస్యలు సైతం విన్నవిస్తున్నారు. వీటికి వెంటనే మోక్షం కలిగిలా పనులకు నిధులు సైతం మంజూరు చేస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అపూర్వ స్పందన..

శ్రీకాకుళం మండల పరిధిలోని 20 పంచాయతీలకు గాను 17 పంచాయతీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యింది. మరో మూడు పంచాయతీల్లో ఈ నెలాఖరు నాటికి కార్యక్రమం పూర్తవుతుందని ఎంపీడీఓ రఘు చెబుతున్నారు. ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ.20లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో ప్రస్తుతం 12 సచివాలయాల్లో 48 పనులు మంజూరయ్యాయి. ఇందుకు రూ.2కోట్ల 40 లక్షలు వెచ్చిస్తున్నారు. మిగిలిన 5 సచివాలయాలు పరిధిలో ఎంపిక చేసిన అభివృద్ధి పనులకు గాను కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు.

నాణ్యతగా పనులు..



ప్రస్తుతం 17 సచివాలయాల్లో జరుగుతున్న పనులు నాణ్యతా ప్రమాణాలతో సాగుతున్నాయి. పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. తేడాలు వస్తే బిల్లుల్లో కోత తప్పదని ముందుగానే కాంట్రాక్టర్లకు తెలియజేశాం. జరిగిన పనులన్నింటికీ బిల్లులు పెట్టాం. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాం.

– రఘు, శ్రీకాకుళం ఎంపీడీఓ

మౌలిక వసతులకు ప్రాధాన్యత..

శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో గడపగడపకు మన ప్రభుత్వం కొనసాగుతోంది. గ్రామస్తుల కోరిక మేరకు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎక్కడెక్కడ రోడ్లు, డ్రైనేజీలు, పైపులైన్లు ఇతరత్రా పనులు మరమ్మతులకు గురయ్యాయో వాటికి సచివాలయాల ద్వారా మంజూరైన రూ.20 లక్షలు ఖర్చు చేయాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ దిశగానే 20 సచివాలయాల్లో పనులు చేసేందుకు ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సమయాత్తమయ్యాయి.



వాకలవలసలో పూర్తయిన డ్రైనేజీ పనులు



నైరాలో పూర్తయిన సీసీరోడ్డు పనులు

వివక్ష లేకుండా పథకాల అమలు



పున్నానపాలెంలో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: కులం, మతం, పార్టీలకతీతంగా, వివక్షకు తావులేకుండా అర్హులందరికీ సీఎం జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం సంచాం గ్రామ సచివాలయ పరిధిలోని పున్నానపాలెం, పెసరపాలెం గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు-మన ప్రభుత్వం నిర్వహించారు. 350 ఇళ్లకు వెళ్లి మూడున్నరేళ్లలో కలిగిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలువలు నిర్మించాలని, ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు మంజూరు చేయాలని స్థానికులు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పున్నానపాలెం, పెసరపాలెం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా సంక్షేమం, అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశమై అర్హులందరికి పథకాలు అందించాలని ఆదేశించారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్ సీపీ మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, అప్పలనర్సునాయుడు, బడి రాంబాబు, సంచాం సర్పంచ్ రెడ్డి సూర్యకాంతం, నాయకులు రెడ్డి రాము, పున్నాన లక్ష్మునాయుడు, శ్రీను, పున్నాన సరోజిని, రెల్లి అప్పలనాయుడు, ఇప్పిలి రమణ, నరవల సూర్య రెడ్డి రామకృష్ణనాయుడు, పతివాడ అప్పలనాయుడు, రెడ్డి ఆనంద్, మీసాల దాలినాయుడు, మీసాల రాము, రెడ్డి సూరప్పు నాయుడు, పప్పల వెంకినాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

లావేరు: మండలంలోని గురుగుబిల్లి, భరిణికాం అంగన్‌వాడీ కేంద్రాలకు కార్యకర్తలు, భట్టుపాలెం, చినరొంపివలస, పెదలింగాలవలస-1, బెజ్జిపురం -1 కేంద్రాల్లో సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ప్రాజెక్టు అధికారి సీహెచ్ ఝాన్సీరాం అన్నారు. శుక్రవారం లావేరులో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ వివాహిత మహిళలై 21–35 ఏళ్ల వయసు కలిగి ఉండాలన్నారు. కార్యకర్తకు పోస్టుకు 10వ తరగతి, సహాయకుల పోస్టుకు 7వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. రోస్టర్ పాయింట్ రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 18 సాయంత్రం 5 గంటల్లోగా జీఆర్‌పురంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

రణస్థలం మండలంలో..

రణస్థలం: మండలంలోని సీహెచ్ కొవ్వాడలో అంగన్‌వాడీ కార్యకర్త, దేవునిపాలవలస, పతివాడపాలెం -1, యమాలవారికాలనీ గ్రామాల్లో సహాయకురాలు, భావరాజుపాలెంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీవో ఝాన్సీరాం ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, రెండు మండలాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ పి.జయంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి అకౌంట్లలో డబ్బులు జమయ్యేలా చూడాలన్నారు. అనంతరం మేనేజర్ స్పందిస్తూ రైతులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గార ఎంపీపీ గొండు రఘురామ్, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పార్టీ నాయకులు గొండు కృష్ణమూర్తి, బగ్గు అప్పారావు, ఎచ్చెర్ల శ్రీధర్, గంగు నరేంద్ర కుమార్, పీస శ్రీహరి, ముంజేటి కృష్ణ, మార్పు పృథ్వీ, గుండ హరేష్ తదితరులు పాల్గొన్నారు.



సివిల్ సప్లయ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



కుంకుమార్చన చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో క్షీరాభిషేకాలు, శ్రీచక్రార్చన, ప్రత్యేక అలంకరణ, హారతి అనంతరం 1001 శ్రీచక్రాల వద్ద మహిళలు కుంకుమార్చనలు చేశారు. లలితాపారాయణం, ఖడ్గమాల, గురుపాదాస్తకం పఠనం చేయించారు. అనంతరం 9 అడుగుల మహామేరువుకు హారతి, పూలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రుత్వికులు పాల్గొన్నారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న బాలభాస్కరశర్మ

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: జాతీయ అంధత్వ, దృష్టి లోపం నివారణ కార్యక్రమంలో భాగంగా ఇప్పిలి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సింగుపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాలమిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ 400 మంది విద్యార్థుల కళ్లను పరీక్షించగా దృష్టిలోపం ఉన్న 29 మందికి కళ్లద్దాలకు సిఫారసు చేశారు. అనంతరం కంటి ఆరోగ్యం-సంరక్షణపై అవగాహన కల్పించారు.

ఘనంగా ఉమారామలింగేశ్వరాలయ వార్షికోత్సవం



శివలింగానికి అభిషేక పూజలు చేస్తున్న అర్చకులు

లావేరు: మండలంలోని బెజ్జిపురంలో ఉమారామలింగేశ్వర పంచాయతీన దేవస్థానం 6వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవల్లి సురేష్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పురోహితులు పుణ్యాహవచనం, సుప్రభాతసేవ, కంకణధారణ, పరివార దేవతలకు అర్చనలు, రుద్రహోమం జరిపించారు. ఉత్సవ మూర్తుల ఊరేగింపు అనంతరం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం కల్యాణ మహోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇజ్జాడ శ్రీనివాసరావు, ఇజ్జాడ అప్పారావు, వడ్డిపల్లి శ్రీనివాసరావు, దన్నాన శ్రీనివాసరావు, కలిశెట్టి దర్మారావు, ఇజ్జాడ సన్యాసినాయుడు, పిన్నింటి సూర్యనారాయణ, పిన్నింటి సురేష్, బలివాడ శ్రీను, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో గ్రామదేవత ముత్యాలమ్మతల్లి ఆలయ 8వ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నిజరూప దర్శనం, పాలతో అభిషేకాలు, పసుపు కుంకుమలతో ముర్రాట్లు సమర్పించడం తదితర కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులంతా హాజరుకావాలని కోరారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లింక్ వర్కర్స్ స్కీమ్ పీఎల్‌హెచ్ ఐవీఎస్ కోడినేషన్ టీమ్స్ సంయుక్తంగా జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు వద్ద శుక్రవారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ పి.జగన్మోహనరావు, జిల్లా టీబీ అధికారి డాక్టర్ అనూరాధ, డీపీఎం ఉమామహేశ్వరరావు, పార్టనర్ ఎన్‌జీఓ కో ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెంచిన పనిభారం తగ్గించాలి

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపోలో పెంచిన పనిభారం తగ్గించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు కె.బాబూరావు, పి.నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపోలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏడో రోజైన శుక్రవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా దీక్ష చేపడుతున్న స్పందించక పోవడం శోచనీయమన్నారు. స్పెషల్ ఆఫ్ డ్యూటీలు రద్దు చేసి రోజూ ఓటీ డ్యూటీలు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. 13 గంటలు పనివిధానం అమలు చేస్తుండటంతో డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం బలవంతపు ఓటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలో జేఏసీ ప్రతినిధులు సీహెచ్ రాజు, ఎం.నర్సింగరావు, పి.సూర్యప్రకాశరావు, ఎండీ రియాజ్, ఎ.త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ జేఏసీ ఉద్యోగులు

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆనందపురంలో షిరిడీ సాయిబాబాను దర్శించుకుని అనంతరం మాట్లాడారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ సమన్వయంతో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతిపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలు పూర్తి చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, టొంపల సీతారాం, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటి సాయి, వైఎస్సార్ సీపీ నాయకులు బూరాడ వెంకట రమణ, చిత్తిరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న డీఎస్‌ఏ చీఫ్ కోచ్ మాధురీలత



స్కిప్పింగ్ పోటీల్లో బాలలు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత అన్నారు. అరసవల్లి సమీపంలోని వాడాడలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం క్రీడా వేడుకలు ఘనంగా జరిగాయి. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుందరరావు, మాధురీలత మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతత, దారుఢ్యం లభిస్తుందన్నారు. అనంతరం బాలబాలికలకు బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్, కరాటే, కరస్రాము, కత్తిసాము, స్కిప్పింగ్, పరుగు పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ముద్దాడ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ ఉషా కిరణ్మయి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ, కోచ్ లక్ష్మణ్‌నాయుడు, పీఈటీ బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

డ్రోన్ ప్రయోజనాలపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

శ్రీకాకుళం రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం రాగోలులో రైతులకు డ్రోన్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. డ్రోన్‌ల సాయంతో పంటల్లో పురుగు మందు పిచికారీ చేసే విధానం వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి.వి.సత్యనారాయణ, వ్యవసాయ సంయుక్త సంచాలకులు శ్రీధర్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం: మండలంలోని బంటుపల్లి పంచాయతీ కంబాలపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పాశపు ముకుందరావు తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, జేసీఎస్ మండల ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, నాయకులు పాశపు వెంకటరావు, గోపిన నారాయణరావు, ముంగం చిన్నారావు, ముంగం శ్రీనివాసరావు, గణపతి, పసుపురెడ్డి నారాయణరావు, కొంపెల్ల అప్పారావు, టొంపల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షిరిడీసాయి విగ్రహ ప్రతిష్ట



పూజలందుకుంటున్న షిరిడీసాయి

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలో నూతనంగా నిర్మించిన షిరిడీసాయి ఆలయంలో బాబా విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. అర్చకులు ధర్మపురి గౌరీశంకరశాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండలక్ష్మీదేవి, ఎం.కృష్ణమూర్తి నాయుడు, గోపి, గిరీష్, కె.వి.ఎన్.మూర్తి, అరవింద్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గ్రామదేవత నూకాలమ్మతల్లి అమ్మవారి ఆలయ తృతీయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి విశేష అభిషేకాలు, మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. సుమారు 3500 మందికి అన్నదానం చేశారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణ, పొన్నాడకు చెందిన హరే రామ భక్త బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నక్కవీధి, దేశెల్లవీధి, కుందనపువీధి గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

వర్సిటీలో దంత వైద్య శిబిరం



దంతాలను పరీక్షిస్తున్న వైద్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శ్రీకాకుళం నగరానికి చెందిన ఉషా డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో శుక్రవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందికి దంత పరీక్షలు చేపట్టి మందులు అందజేశారు. దంతాల పరిరక్షణపై అవగాహన కల్పించారు. డాక్టర్ కల్యాణ చక్రవర్తి, శ్రావ్య, క్లినిక్ మేనేజర్ తులసీదేవ్ సింధు పర్యవేక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో స్వచ్ఛభారత్



చెత్తా చెదారం తొలగిస్తున్న విద్యార్థులు

గార: కె.మత్స్యలేశం పరిధిలోని కళింగ బీచ్‌లో స్థానిక బుద్ధా పాఠశాల విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛభారత్ చేపట్టారు. బీచ్‌లో డ్రెడ్జింగ్ పనులు జరుగుతుండటంతో పూర్వ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. సర్పంచ్ బి.లలిత, పాఠశాల చైర్మన్ బి.ఎర్రన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధార్ సేవలు



ఆధార్ అప్‌డేషన్ చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల కోసం శుక్రవారం ఆధార్ సేవల కేంద్రం ఏర్పాటు చేశారు. ఆధార్‌కార్డుల అప్‌డేషన్ ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ పాగిరి రాము, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. హాథ్ సే హాథ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్టీ నాయకులు శ్రీకాకుళం అరసవల్లి కూడలి నుంచి సూర్య మహల్ వరకు పాదయాత్ర చేపట్టారు. పార్టీ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో రాసిన లేఖను, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు చేయబోయే సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేశెళ్ల గోవింద మల్లిబాబు, రెల్ల సురేష్, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, అంబటి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి మృతికి సంతాపం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వసతి గృహంలో పనిచేస్తున్న వంతరగిరి భాస్కరరావు గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. వర్సిటీలో శుక్రవారం సంతాప సభ నిర్వహించి నివాళులు అర్పించారు. రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, వర్సిటీ అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.